క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అతిథి అధ్యాపక నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.భీమార్జునరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్ పీజీలో జనరల్, ఓబీసీ అభ్యర్థులకు 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండాలని ఆయన తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ కలిగిన అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 18 నుంచి 20 లోపు తమ దరఖాస్తులను కళాశాలలో సమర్పించాలని ఆయన పేర్కొన్నారు.

చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లు


బాధ్యతలు స్వీకరిస్తున్న బుర్రా వెంకటేశ్వర్లు

నడిగూడెం : మండల పరిధిలోని తెల్లబల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా రెండోసారి బుర్రా వెంకటేశ్వర్లు బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో పాలకవర్గం సర్వసభ్య సమావేశాలు నిర్వహించనందున గత ఏడాది మార్చి నెలలో పాలకవర్గాన్ని రద్దు చేసి ప్రత్యేక అధికారి ఇందిరకు బాధ్యతలు అప్పగించారు. దీంతో పలువురు పాలకవర్గ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు చైర్మన్ బుర్రా వెంకటేశ్వర్లుకు పదవీ బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఇందిర, సీఈఓ ప్రభాకర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఈఓ పోస్టుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని వినతి

నడిగూడెం : వ్యవసాయ శాఖలో ఏఈఓ పోస్టుల భర్తీలో ఇంటర్మీడియట్ వృత్తి విద్య కోర్సు అయిన క్రాప్ ప్రొడక్షన్ చదివిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ బుధవారం నడిగూడెంకు చెందిన పలువురు అభ్యర్థులు హైదరాబాద్‌లోని సచివాలయంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గతంలో పలు జీఓల ప్రకారం వృత్తి విద్య కోర్సు చదివిన అభ్యర్థులకు ఏఈఓ పోస్టులకు అవకాశం ఇచ్చారని, మళ్లీ అదే జీఓలను అమలు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో కాసాని గోపీనాథ్, దున్నా అనిల్, తదితరులు ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నడిగూడెం : మండల పరిధిలోని రత్నవరం గ్రామానికి చెందిన మొలుగూరి ఆకాష్ (25) ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి కుటుంబం నిరుపేద కావడంతో బుధవారం అదే గ్రామానికి చెందిన విక్టరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి ఐదు వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ చైర్మన్ గుండు వెంకట్‌గౌడ్, కోఆర్డినేటర్ నందిగామ రామారావు, సభ్యులు సీతారాములు, రవి ప్రతాప్, కోటయ్య, నర్సింహారావు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం


డ్రెయినేజీ నిర్మాణ పనులు చేయిస్తున్న కౌన్సిలర్ సంపత్‌రెడ్డి

హుజూర్‌నగర్ : వార్డులో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కౌన్సిలర్ కోతి సంపత్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని మూడవ వార్డు ఎన్జీఓ కాలనీలో జరుగుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కామిశెట్టినగర్, చైతన్య కాలనీ, ఎన్జీవోస్ కాలనీలకు సీసీ రోడ్లు, డ్రెయినేజీలు మంజూరు అయ్యాయని, త్వరలో నిర్మాణ పనులు పూర్తిచేస్తామని ఆయన తెలిపారు. అంతేకాకుండా ఎన్జీవో కాలనీ మెయిన్ రోడ్డు, ఏవీఎస్ అపార్ట్‌మెంట్ రోడ్ల కోసం ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు.

ఖబరస్తాన్ ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం


ఖబరస్తాన్ ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ భూక్యా గోపాల్

పాలకవీడు : మండలంలోని యల్లాపురం గ్రామంలో ఖబరస్తాన్ ప్రహరీ నిర్మాణ పనులను ఎంపీపీ భూక్యా గోపాల్, జెడ్పీటీసీ బుజ్జి మోతీలాల్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల గ్రామంలో పర్యటించిన సందర్భంగా ఖబరస్తాన్‌కు ప్రహరీ, మౌలిక వసతులు కల్పించాలని మంత్రిని ముస్లింలు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. దీంతో మంత్రి ఉత్తమ్ డీఎంఎఫ్‌టీ నిధులు రూ.8 లక్షలు మంజూరు చేయగా పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జితేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు తీగల శేషురెడ్డి, తీగల వెంకట్‌రెడ్డి, వార్డు సభ్యులు, ముస్లింలు అజిత్, చాంద్‌పాషా, కయూమ్, రషీద్, అన్వర్ పాల్గొన్నారు.

చెత్త తరలింపుపై పట్టింపేదీ!


బేతవోలు నుంచి జెర్రిపోతులగూడెం వెళ్లే రోడ్డుపై చెత్త


బేతవోలు గ్రామ శివారులో..

- రోడ్లవెంట వ్యర్థాలు
- డంపింగ్ యార్డుకు తరలించడం మరిచిన పంచాయతీ సిబ్బంది
- దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన చెందుతున్న ప్రజలు

చిలుకూరు : మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల వెంట చెత్త పేరుకుపోయింది. డంపింగ్ యార్డులో వేయాల్సిన చెత్తను రోడ్ల వెంట వేస్తుండడంతో రోడ్డుకు ఇరువైపులా చెత్తచెదారం దర్శనమిస్తోంది. స్వచ్ఛభారత్‌లో భాగంగా గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలనే ఉద్దేశ్యంతో గ్రామాల్లో ఎన్‌ఆర్ ఈజీఎస్ పథకం కింద చెత్త డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశారు. డంపింగ్ యార్డులు నిర్మించిన ప్రారంభంలో చెత్త సేకరణకు గ్రామ పంచాయతీ ట్రాక్టర్లు ఇంటింటికీ వచ్చేవి. క్రమక్రమంగా చెత్త తరలించడానికి పంచాయతీ ట్రాక్టర్లు రాకపోవడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. డంపింగ్ యార్డులో వేయాల్సిన చెత్తను ప్రజలు తిరిగి రోడ్డు వెంటే వేస్తున్నారు. రోడ్ల వెంట ఎక్కడ చూసినా చెత్త కనబడుతోంది. రోడ్ల వెంట చెత్తతో పాటు కుళ్లిపోయిన పదార్థాలు పడవేస్తుండడంతో దుర్వాసనతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా దోమలు వ్యాప్తి చెంది విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ, వైద్యశాఖ అధికారులు స్పందించి రోడ్ల వెంట చెత్త లేకుండా చేయాలని, ఆ ప్రదేశాల్లో, గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని గ్రామస్తులు కోరుతున్నారు.


చిలుకూరు - బేతవోలు రోడ్డులో..

ముగిసిన వృత్తి నైపుణ్య శిక్షణ


శిక్షణ పొందిన అభ్యర్థులు

నడిగూడెం : మండల పరిధిలోని వల్లాపురంలో న్యాక్ సంస్థ ఆధ్వర్యంలో గత 15 రోజులుగా భవన నిర్మాణంపై నిర్వహిస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణ బుధవారం ముగిసింది. భవన నిర్మాణంలో మెళకువలను ప్రయోగపూర్వకంగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన ట్రైనర్ కరుణసాగర్, కోఆర్డినేటర్ గుండ్లపల్లి బుచ్చిరాములను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాపీ మేస్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దళితబంధు నగదు మంజూరు చేయాలి

నడిగూడెం : పెండింగ్‌లో ఉన్న దళిత బంధు నగదు మంజూరు చేయాలని ఎంఎస్‌ఎఫ్ జిల్లా నాయకుడు పందిటి నవీన్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం అమలు చేసిన దళిత బంధుకు సంబంధించిన నిధులు జిల్లా కలెక్టర్ అకౌంట్‌లో ఫ్రీజ్ చేశారని, ఆ నగదును సంబంధిత లబ్ధిదారులకు మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మఠంపల్లిలో మాట్లాడుతున్న సయ్యద్‌రన్‌మియా

మఠంపల్లి : ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్‌రన్‌మియా కోరారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సీఐటీయూ మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికుల సర్వీస్‌లను రెగ్యులర్ చేయాలని, మధ్యాహ్న భోజన ఏజెన్సీల బిల్లులు క్రమం తప్పకుండా చెల్లించాలని, అంగన్‌వాడీ, హమాలీలు, పాఠశాలల స్వీపర్లు తదితర రంగాల వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల నాయకులు గుర్రం లింగమ్మ, ఎం.మైసయ్య, కె.గురువారెడ్డి, దేవదానం, లాలాసాహెబ్, శాంతికుమారి, పాడిశెట్టి రాము, పద్మ, సాలమ్మ, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు సన్మానం


అర్చకులను సన్మానిస్తున్న వేమూరి సత్యనారాయణ

మునగాల : మండలంలోని నరసింహాపురంలో గల శ్రీకోదండరామస్వామి దేవాలయంలో కొలువై ఉన్న శ్రీగోదా రంగనాయకుల స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించిన పలువురు అర్చకస్వాములను మంగళవారం రాత్రి శ్రీకోదండరామస్వామి సేవాసమితి, సాంస్కృతిక, సామాజిక సేవ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.వేమూరి సత్యనారాయణ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుర్మాసంలో ప్రతిరోజు పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించి, స్వామివార్ల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించిన అర్చకస్వాములు శ్రీరంగనాయకస్వామి, శ్రీమాన్ ముడుంబా మురళీకృష్ణమాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబా శేషాచార్యులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించినట్లు తెలిపారు.

గ్రామ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలి


గ్రామ సభలో పాల్గొన్న గ్రామస్తులు

మఠంపల్లి : గ్రామ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని సర్పంచ్ మీనాపక్రియా కోరారు. స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని మంచ్యాతండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో గ్రామ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలని ఏకగ్రీవంగా తీర్మాణించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్యా రాయసెల్, కార్యదర్శి ప్రవీణ్, ఫీల్డ్ అసిస్టెంట్ రవినాయక్, వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న వేమూరి సత్యనారాయణ

మునగాల : హైదరాబాద్‌లో పోలీస్ శాఖలో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న ఆకుపాముల గ్రామానికి చెందిన చింతల శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా బుధవారం మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించినట్లు సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు నాగిరెడ్డి విజయమ్మ, అన్నదాన దాత శ్రీనివాస్ మిత్రులు పోలంపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాస్టర్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట పట్టణ పాస్టర్ ఫెలోషిప్ నూతన కమిటీని బుధవారం మాజీ అధ్యక్షుడు మీసాల ప్రభుదాస్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. బ్యాలెట్ ద్వారా జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా జలగం డేవిడ్ రాజు, ప్రధాన కార్యదర్శిగా కేశవరపు కరుణాకర్, కోశాధికారిగా రమేష్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పూజర్ల సామ్యూల్ కిరణ్, ఉపాధ్యక్షులుగా కోక యేసు రత్నం, బొడ్డు ముత్తాయి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కోర్నేలి పాల్ పాల్వాయి, సహాయ కార్యదర్శిగా కోడూరి ఎజ్రా, సహకోశాధికారిగా ప్రసన్నకుమార్, మీడియా కన్వీనర్ గా మచ్చ ఏసు పాదం, సహకన్వీనర్ గా కందుకూరి ఏసు రాజు, సభల కన్వీనర్గా లక్ష్మీ శెట్టి ప్రేమ్ కుమార్, కో కన్వీనర్ గా కర్నే మని దాసు, ప్రేయర్ కన్వీనర్ గా నిమ్మనగోటి ఏరియా, కో కన్వీనర్ గా జాన్ పాల్, కల్చరల్ కన్వీనర్ గా జనార్దన్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా వీరేష్, దుర్గాప్రసాద్, నగేష్ లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మామిడి సామ్సన్, కాసర్ల శ్రవణ్ కుమార్, దామెర్ల పాల్, సాయిని జాకబ్, జోహార్ పాల్, లేజర్ నాయక్, మరియన్న, సుదర్శన్, డానియల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది నిరక్ష్యం

- పట్టపగలు వెలుగుతున్న విద్యుత్ లైట్


విద్యుత్ స్తంభానికి పట్టపగలు వెలుగుతున్న లైట్

చిలుకూరు : చిలుకూరు గ్రామ శివారులోని దూదియా తండా రోడ్డులో విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పట్టపగలు కూడా విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. కరెంట్‌ను ఆదా చేస్తే కరెంట్‌ను తయారు చేసినట్లే అని ఉన్నత స్థాయి అధికారులు చెబుతున్నా కింది స్థాయి విద్యుత్ అధికారులు మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. తక్షణమే విద్యుత్ అధికారులు స్పందించి పట్టపగలు విద్యుత్ దీపాలు వెలగకుండా చూడాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

న్యూడెమోక్రసీ నుంచి కారింగుల వెంకన్న సస్పెన్షన్



మాట్లాడుతున్న నాగయ్య

దురాజ్‌పల్లి (సూర్యాపేట): న్యూడెమోక్రసీ నుంచి కారింగుల వెంకన్నను సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ డివిజన్ కార్యదర్శి గంట నాగయ్య తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కారింగుల వెంకన్న గత కొంత కాలం నుంచి పార్టీకి సంబంధం లేకుండా ఉంటున్నాడని, డబ్బుల లావాదేవీల విషయాల్లో పంచాయితీలు చేస్తున్నట్లు పార్టీ దృష్టికి వచ్చిందని తెలిపారు. అందుకే పార్టీ నుంచి అతడిని సస్పెండ్ చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, డివిజన్ నాయకులు కాకి మోహన్ రెడ్డి, పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షులు పోలేబోయిన కిరణ్, డివిజన్ నాయకులు సంపేట కాశయ్య, దేసోజు మధు, పోరెండ్ల దశరథ, అరుణోదయ జిల్లా ఉపాధ్యక్షులు బొల్లె వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

దారిని ధ్వంసం చేసిన వ్యక్తులపై కేసు

అనంతగిరి: కోదాడ మున్సిపాలిటీ డంపింగ్ యార్డు దారిని ధ్వంసం చేసిన వ్యక్తులపై అనంతగిరి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని వెంకట్రాంపురం పరిధిలో గల కోదాడ మున్సిపాలిటీ దారిని బత్తుల ఉపేందర్, శ్రీహరిలు ధ్వంసం చేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీ డంపింగ్ యార్డు ఇంచార్జి గోపయ్య ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జయశంకర్ విగ్రహాన్ని కూల్చిన దుండగులను శిక్షించాలి

మిర్యాలగూడ : తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని కూల్చిన దుండగులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని బీసీ జేఏసీ నాయకులు కోల సైదులు, మహేష్‌గౌడ్, దాసరాజు జయరాజులు అన్నారు. బుధవారం పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించి వారు మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటుకు దశదిశ చూపిన తెలంగాణ మేధావి జయశంకర్ విగ్రహాన్ని కూల్చడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ ఏర్పాటులో జయశంకర్ పాత్ర ఎనలేనిదన్నారు. ఇప్పటికైనా జయశంకర్ విగ్రహాన్ని కూల్చిన వారిని కఠినంగా శిక్షించి తిరిగి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు సుధాకర్, వెంకటేశ్వర్లు, ఈశ్వరాచారి, ఏడుకొండలు, బంజారా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు దశరథ నాయక్, మోసిన్‌అలీ, బంటు కవిత పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

మిర్యాలగూడ అర్బన్ : హైదరాబాద్‌లోని శేర్‌లింగంపల్లిలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని కూల్చిన దుండగులను కఠినంగా శిక్షించాలని బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద జయశంకర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి నిరసన వ్యక్తం చేశారు. బీసీ జేఏసీ నాయకులు కోల సైదులు, మహేష్‌గౌడ్ మాట్లాడారు. బీసీ సంఘం నాయుకులు సుధాకర్ వెంకటేశ్వర్లు, ఈశ్వరాచారి, ఏడుకొండలు, మాలోతు దశరథనాయక్, మురళి పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తాం


మాట్లాడుతున్న సుధా బ్యాంక్ ఎండీ గణేష్

కోదాడ : ఖాతాదారులకు మెరుగైన సేవలందించడానికి తమ బ్యాంక్ ఎల్లప్పుడూ ముందుంటుందని సుధా కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్, ఎండి పెద్దిరెడ్డి గణేష్ అన్నారు. బుధవారం కోదాడలో జరిగిన బ్యాంక్ ఖాతాదారుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. 24 సంవత్సరాలుగా తమ బ్యాంక్ ఖాతాదారులకు విశేషమైన సేవలందిస్తుందని తెలిపారు. వాణిజ్య వర్గాలకే కాకుండా వ్యవసాయానికి, ఖాతాదారులకు ఉపాధి నిమిత్తం తమ బ్యాంక్ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. త్వరలో మరిన్ని సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదాడ బ్రాంచ్ మేనేజర్ రవికుమార్, పానుగోటి నిర్మల, చంద్రశేఖర్, చెన్నకేశవరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు


తలపడుతున్న కబడ్డీ జట్లు

మఠంపల్లి : సంక్రాంతి సందర్భంగా మండలంలోని యాతవాకిళ్లలో ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం మూడవరోజు హోరాహోరీగా కొనసాగాయి. సుమారు 38 జట్లు ఈ పోటీలలో తలపడుతున్నాయి. పోటీలు ముగియగానే విజేతలకు దాతల సహకారంతో బహుమతులు అందజేస్తామని విన్నర్స్ అకాడమీ అసోసియేషన్ అధ్యక్షుడు కె.నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంటిపులి శ్రీను, బండి వెంకటరెడ్డి, కీసర వెంకన్న గడ్డం వీరయ్య, సైదయ్య, అంజి తదితరులు పాల్గొన్నారు.

యాతవాకిళ్లలో కొనసాగుతున్న క్రికెట్ పోటీలు


ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ సెమీ ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మీనరసింహరాజు

మఠంపల్లి : సంక్రాంతి సందర్భంగా మండలంలోని యాతవాకిళ్లలో బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు కొసాగుతున్నాయి. బుధవారం నాలుగవ రోజు సెమీ ఫైనల్ పోటీలను స్థానిక సర్పంచ్ కోలాహలం లక్ష్మీనరసింహరాజు ప్రారంభించారు. పోటీల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 42 టీమ్‌లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోలాహలం కృష్ణంరాజు, ఉపసర్పంచ్ శాంతినరసింహారెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఎల్లావుల నాగయ్యాయాదవ్, మచ్చ వెంకటేశ్వర్లు, లక్ష్మణ్‌రాజు, లింగరాజు, సైదులు, వెంకన్న, సైదాహుస్సేన్, నాగుల్‌మీరా, పులి లచ్చయ్య, వెంకటనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలు


నేరేడుచర్ల : కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి శ్రీనివాస్


మునగాల : రేపాలలో పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

నేరేడుచర్ల : జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా పెంపుడు కుక్కలకు వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పశువైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని పశువైద్యశాలలో టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా 35 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపాలలో..

మునగాల : మండలంలోని రేపాలలో గల ప్రాథమిక పశువైద్య కేంద్రంలో బుధవారం పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి డా.శ్రావణి తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ షేక్ అబ్దుల్ లతీఫ్, గోపాల మిత్రలు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలి


మాట్లాడుతున్న నరేందర్

భానుపురి (సూర్యాపేట): చట్టసభల్లో బీసీలకు వాటాను సాధించడమే తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన లక్ష్యమని దేశంలో 60 శాతంగా ఉన్న బీసీలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకుండా పోయిందని, విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో బీసీలు వెనుకబడి ఉన్నారని తెలంగాణ బీసీసంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో రాజు, భిక్షపతి గౌడ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతు దిగాలు


చౌటపల్లి సమీపంలో పూత పూయని మామిడి తోట


బక్కమంతులగూడెం సమీపంలో..

- పూత పూయని మామిడి తోటలు
- 90 శాతం తోటలు ఇదే పరిస్థితి
- ఉద్యానవన అధికారులు పరిశీలించి ఆదుకోవాలని కర్షకుల వేడుకోలు

మఠంపల్లి : మామిడి రైతులు ప్రస్తుతం భిన్నమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. మామిడి తోటలో ఇప్పటికీ పూత లేక దిగులు చెందుతున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఇంతవరకు సరైన పూత, పిందె లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మండలంలోని చౌటపల్లి, బక్కమంతులగూడెం, మఠంపల్లి, త్రివేణినగర్, అవిరేణికుంటతండా, అల్లీపురం తదితర గ్రామాలు, గిరిజన తండాల పరిధిలో సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటలు ఉన్నాయి. అయితే ప్రతి ఏడాది డిసెంబర్ మాసానికి పూత, పిందెలతో పాటు కాయలతో మామిడి తోటలు కళకళలాడుతూ ఉండేవి. కానీ ఈఏడాది ఇప్పటివరకు 90 శాతం తోటలలో పూత, పిందె లేదు. దీంతో ఈ ఏడాది దిగుబడి కష్టమేనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు ఎన్నో ఆశలతో మామిడి తోటలను కౌలుకు తీసుకున్నారు. కానీ మామిడి తోటలపై పూత పూత సక్రమంగా కనిపించకపోవడంతో విచారం వ్యక్తం చేస్తున్నారు. ఏదో కొద్దిపాటిగా 10 శాతం పూత పూసినా కురుస్తున్న మంచుకు అదికాస్తా రాలిపోతుందని అంటున్నారు. ముఖ్యంగా అదును వారీగా వర్షాలు కురవకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని కొంత మంది రైతులు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి మామిడి తోటల రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. అంతేగాక వ్యవసాయ, ఉద్యానవన శాఖల శాస్త్రవేత్తలు, అధికారులతో మామిడి తోటల రైతులకు అధిక దిగుబడి సాధించేందుకు మెళకువలు, సలహాలు, సూచనలతో పాటు సాగుకు శిక్షణ ఇవ్వాలని కోరుతున్నారు.

అధికారులు పరిశీలించాలి



మండలంలోని మామిడి తోటలు పూత పూయలేదు. వ్యవసాయ, ఉద్యానవన శాస్త్రవేత్తలు, అధికారులు తోటలను పరిశీలించి రైతులను ఆదుకోవాలి.
– శాగంరెడ్డి గోపాల్‌రెడ్డి మామిడి రైతు, చౌటపల్లి

పెట్టుబడి సాయం అందించాలి



పూత పూయని మామిడి తోటలను అధికారులు పరిశీలించాలి. మామిడి రైతులు, యజమానులకు సబ్సిడీతో కూడిన పెట్టుబడులు అందించాలి.
– మాళోతు బాలునాయక్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు